నేటి తరానికి గాంధీజీ జీవితమే స్ఫూర్తి

గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 2 : నేటి తరానికి మహాత్మా గాంధీజీ జీవితమే స్ఫూర్తి అని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 155వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పింకేశ్ కుమార్ మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహోన్నతుడు గాంధీజీ అని కొనియాడారు. అహింసాయుత మార్గంలో దేశానికి స్వాంతంత్ర్యం తీసుకొచ్చిన ఘనత వారికే దక్కుతుందన్నారు. మహాత్ముడి ఆశయ సాధనకు ప్రతిఒకరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పారిశుధ్యం మెరుగుకోసం జిల్లాలో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని గాంధీజీ కన్న కలలు నేడు సాకారం అవుతున్నాయని తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి రవీందర్, డీఏవో రామారావు, డీఈవో రాము తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

టీచర్లను సన్మానిస్తున్న సీడీపీవో రమాదేవి

బచ్చన్నపేట, అక్టోబర్ 2 : అంకితభావంతో పని చేస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి అన్నారు. మండలంలోని లింగంపల్లి సెక్టార్ పరిధి నక్కవానిగూడెంలో మంగళవారం సాయంత్రం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందిన అయాలను ఘనంగా సన్మానించారు. రమాదేవి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సైతం ప్రాథమిక స్థాయి నుంచే చిన్నారులకు పాఠాలు బోధించి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు కన్‌రాజ్ నాగమణి, మినలాపురం ఉషారాణి, విజయ, కమల, రాములమ్మ, పెరుమాళ్ల సునీత పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి : కేవీపీఎస్

లింగాలఘనపురం, అక్టోబర్ 2 : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు తూడి దేవదానం అన్నారు. కేవీపీఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో బుధవారం జెండాను ఎగురవేసి మాట్లాడారు. మబ్బు ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేవదానం మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో దళితుల సమస్యలపై పోరాడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు అతియా సుల్తానా, శేఖర్, పరశురాములు, లావణ్య, మేరీ, శోభ, రమేశ్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం

పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న జలేంధర్‌రెడ్డి

లింగాలఘనపురం, అక్టోబర్ 2 : మండల కేంద్రంలోని పంచాయతీ సిబ్బందిని ఎంపీడీవో జలేంధర్‌రెడ్డి బుధవారం సన్మానించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గతనెల 17 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు జరిగిన స్వచ్ఛతాహిసేవను సిబ్బంది విజయవంతం చేసిందన్నారు. పచ్చదనం– పరిశుభ్రత, డైనేజీ శుభ్రపరచడం, దోమల నివారణ చర్యలు, తడిచెత్త, పొడి చెత్త సేకరించడం వంటి కార్యక్రమాల్లో సిబ్బంది చురుగ్గా పాల్గొని విజయవంతం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కారోబార్ బోయిని సురేశ్‌కుమార్, నాయకులు కేమిడి భిక్షపతి, మేడె తిరుమలయ్య, రమేశ్, ఏదునూరి వీరన్న, బోయిని యాదగిరిస్వామి, చెన్నూరి మల్లేశం పాల్గొన్నారు.

ఘనంగా భాషోపాధ్యాయ సంస్థ ఆవిర్భావ వేడుకలు

ఆవిర్భావ వేడుకల్లో ఉపాధ్యాయులు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 2 : రాష్ట్ర భాషోపాధ్యాయ తెలంగాణ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) 22వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం జిల్లాకేంద్రంలో ఘనంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంస్థ జెండావిష్కరణను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిరికొండ కుమారస్వామి, వూట్ల శ్రీనివాసాచారి మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన పదోన్నతుల్లో మిగిలిపోయిన భాషా పండితులకు కూడా ప్రమోషన్లు ఇప్పించేలా సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి లక్ష్మణ్ బాబు, పానుగంటి రామ్మూర్తి, గోపి కిషన్, శేషకుమార్, సునీత, వసంత, సరళాదేవి, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఎన్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి : జడ్జి

జనగామ చౌరస్తా, అక్టోబర్ 2 : ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీ విక్రమ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సబ్ జైల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విక్రమ్ హాజరై మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జైల్లో ఉన్న వారంతా విచారణలో ఉన్న ఖైదీలు మాత్రమే అని తెలిపారు. ఆవేశంలో విచక్షణ కోల్పోయి చేసే పనుల వల్ల జైలు జీవితం గడపాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ యోగ, ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. బెయిల్ గ్రాంట్ అయినా కూడా డబ్బులు కట్టలేని పేద ఖైదీలుంటే సత్వరమే వారిని విడుదల చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ప్రశాంతంగా ఉత్సవాలు జరపాలి

తరిగొప్పుల, అక్టోబర్ 2: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై అయ్యల శ్వేత సూచించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అన్ని పండుగలను ఆయా మతాల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలోని చిన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం నుంచి నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు.

జనగామలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

దేవరుప్పులలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

పాలకుర్తిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎంగిలి పూల సంబురం..

- తీరొక్క పూలతో బతుకమ్మ వేడుకలు
- ఆడిపాడిన ఆడబిడ్డలు
- జిల్లా వ్యాప్తంగా పూల పండుగ

జనగామలోని బాలాజీనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జనగామ చౌరస్తా/నర్మెట/బచ్చన్నపేట/దేవరుప్పుల/జనగామరూరల్/తరిగొప్పుల/స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/పాలకుర్తి/చిల్పూరు, అక్టోబర్ 2 : 'చిత్తు చిత్తుల బొమ్మ శివుడి ముద్దుల గుమ్మ, బంగారు బొమ్మ దొరికె నమ్మో ఈ వాడలోన' అంటూ పల్లె, పట్టణ ఆడబిడ్డలంతా కలిసి తీరొక్కపూలతో ఎంగిలి పూల బతుకమ్మను పూజిస్తూ ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను బుధవారం జిల్లాలో మహిళలంతా ఘనంగా జరుపుకున్నారు. ప్రకృతిని ఆరాధించే పండుగ కావడంతో ఆడబిడ్డలు భక్తి, శ్రద్ధలతో తంగేడు, గునుగు, గుమ్మడి, బంతి పూలతో అందమైన బతుకమ్మగా గౌరమ్మను పేర్చారు. స్థానిక బతుకమ్మకుంటతో పాటు 30 వార్డుల్లోని ప్రధాన కూడళ్లలో చిన్న, పెద్ద తేడా లేకుండా మహిళలంతా కలిసి బతుకమ్మను తమ పాటలతో కొలిచారు. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత చర్యలు చేపట్టారు. గ్రామాల్లోని ముఖ్య కూడళ్ల వద్ద ఆడబిడ్డలు ఆడిపాడారు. పలు గ్రామాల్లో చెరువుల వద్ద అధికారుల ఏర్పాట్లు చేయకపోవడంతో చీకట్లోనే బతుకమ్మను నిమజ్జనం చేశారు. నర్మెట, బచ్చన్నపేటలోని ప్రధాన కూడళ్ల వద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో లైటింగ్ సౌకర్యం కల్పించారు. బతుకమ్మలు నిమజ్జనం చేసే చెరువుల వద్ద డోజర్లతో క్లీనింగ్ చేయించి, లైటింగ్ ఏర్పాటు చేశారు. దేవరుప్పుల మండలంలో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. సాయంత్రం మహిళలందరూ బతుకమ్మలతో శోభాయాత్రగా చెరువులు, వాగుల వద్దకెళ్లారు. బతుకమ్మ పాటలు పాడుతూ నిమజ్జనం చేశారు. మరోవైపు వర్షం కురవడంతో వేడుకలకు అవాంతరాయం ఏర్పడింది. జనగామ మండలం సిద్దెంకిలో బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ సర్కారు అందించిన బతుకమ్మ చీరలను ధరించిన మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆడబిడ్డల కానుక ఇవ్వకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని చెరువు కట్ట వద్ద, శివునిపల్లిలోని శివాలయంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మ పాటలు పాడగా, యువతులు నృత్యాలు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జఫర్‌గఢ్ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల చెరువుల వద్ద మహిళలు బతుకమ్మ ఆడారు. విద్యుత్ వెలుగుల్లో వేడుకలు నిర్వహించిన అనంతరం చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పాలకుర్తి మండల కేంద్రంలో బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. వివిధ గ్రామాలతో పాటు మంచుప్పలలో నిర్వహించిన బహుజన బతుకమ్మ వేడుకలకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవ స్థాపకురాలు విమలక్క హాజరై బతుకమ్మ ఆడారు. చిల్పూరు మండల కేంద్రంతోపాటు చిన్నపెండ్యాల, శ్రీపతిపల్లి, రాజవరం, పల్లగుట్ట, వెంకటేశ్వర పల్లే, వెంకటాద్రిపేట, మల్కాపూర్, లింగపల్లి, పల్లగుట్ట, కృష్ణాజిగూడెం, ఫతేపూర్, గార్లగడ్డ, నష్కల్, వంగాలపల్లి గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.

కేసీఆర్ సార్ ఉన్నప్పుడే చీరలు ఇచ్చారు..

'బీఆర్ఎస్ హయాంలో నాటి సీఎం కేసీఆర్ సార్ మహిళలకు చీరెలు ఇచ్చారు. బతుకమ్మ పండుగను ఘనంగా జరిపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పట్టించుకోవడం లేదు..' అని పలువురు తెలిపారు. బతుకమ్మ పండుగ సంబురాల సందర్భంగా తరిగొప్పులలో పలువురు మహిళలు మాట్లాడారు. ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు.

కట్కూర్‌లో బతుకమ్మలతో మహిళలు

చాగల్లులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మల్కాపూర్‌లో బతుకమ్మలతో మహిళలు

మంచిప్పలలో బతుకమ్మ ఆడుతున్న విమలక్క

సిద్దెంకిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మలను తీసుకొస్తున్న యువతులు, మహిళలు

జనగామలోని శ్రీనగర్ కాలనీలో..

తరిగొప్పులలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పాలకుర్తిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వెల్దండలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

సాగరంలో బతుకమ్మ సంబురాల్లో మహిళలు

పేదల కోసం ఉద్యమించిన యోధుడు నల్ల నర్సింహులు

జయంతి వేడుకల్లో వక్తలు

కడవెండిలో నల్ల నర్సింహులు స్తూపం వద్ద, పాలకుర్తిలో నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

దేవరుప్పుల, అక్టోబర్ 2: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నల్ల నర్సింహులు 98వ జయంతి వేడుకలను బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘటన నిర్వహించారు. మండలంలోని కడవెండిలోని నల్ల నర్సింహులు స్తూపానికి బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తాటిపల్లి మహేశ్‌తో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నల్ల నర్సింహులు నిర్వహించిన పోరాటం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల నర్సింహులు వారసులు నల్ల యాదగిరి, ఉపేందర్, అశోక్, రమేశ్, వీరస్వామి, అమరుడు దొడ్డి కొమురయ్య వారసుడు దొడ్డి భిక్షపతి, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశ్, నాయకులు సుడిగెల హనుమంతు, సాయలు, రాములు, యాదయ్య, పెద్ది రవీందర్, నగేశ్, మజర్‌పాషా, షఫీ, అశోక్, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, అనిల్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : తెలంగాణ సాయుధ పోరాటయోధుడు నల్ల నరసింహులు జయంతి వేడుకలను బుధవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పాలకుర్తిలో ఘనంగా నిర్వహించారు.నల్ల నరసింహులు వారసురాలు అరుణక్క ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మాచర్ల సారయ్య, చిలుకమారి వెంకన్న,చిలుకమారి నాగేశ్వర్, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్, చిదురాల మార్కండేయ, కామారపు సునీల్, బైరు భార్గవ్, కాటబత్తిని రమేశ్ పాల్గొన్నారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య, డాక్టర్ రాపోలు సత్యనారాయణ, జర్నలిస్టు మార్గం లక్ష్మీనారాయణ తదితరులు నివాళులర్పించారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి : సీఐ

రఘునాథపల్లి, అక్టోబర్ 2: అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో కొందరు ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు వెళ్తారని తెలిపారు. ఇలాంటి వారు పొరుగింటి వారికి సమచారం ఇవ్వడంతోపాటు వీలైతే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. బతుకమ్మ సందర్భంగా చోరీలు జరిగే అవకాశమున్నందున దీని నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ పేర్కొన్నారు. అవసరమైతే 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు.

లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న ఎంపీడీవో, గ్రామపంచాయతీ సిబ్బంది

ఉత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు : ఎంపీడీవో

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 2 : ప్రజల్లో నిలిచిపోయేలా ప్రతి ఉద్యోగి సేవలు అందించాలని ఎంపీడీవో విజయశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని శివునిపల్లి గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ వేముల లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా సేవలందించి, ఇటు అధికారులతో పాటు ప్రజల్లో లక్ష్మీనారాయణ మంచి పేరు తెచ్చుకున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ సుమలత, కంప్యూటర్ ఆపరేటర్ రాజు, సిబ్బంది లాజర్, బాబురావు, యాకుబ్, వివిధ పార్టీల నాయకులు చిగురు విజయ్, తోట రమేశ్, మేకల మల్లేశం పాల్గొన్నారు.

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సృజన్‌కుమార్

ట్రాక్టర్ కేజీవీల్స్ దొంగ రిమాండ్

దేవరుప్పుల, అక్టోబర్ 2: ట్రాక్టర్ కేజీవీల్స్ చోరీ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్సై సృజన్‌కుమార్ వెల్లడించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సీతారాంపురానికి చెందిన రైతు వన్నెకాల భీమేశ్ వ్యవసాయ బావి వద్ద ట్రాక్టర్‌కు చెందిన కేజీవీల్స్ ఉంచగా కొద్ది రోజుల క్రితం వాటిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా బుధవారం మండల పరిధిలోని గొల్లపల్లి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కామారెడ్డిగూడేనికి చెందిన తీగల సురేశ్ తన టాటాఏస్ వాహనంలో కేజీ వీల్స్ వేసకుని తిర్మలగిరి వైపు వెళ్తున్నాడు. దీనిపై పోలీసులు ఆరా తీయగా తిర్మలగిరిలో అమ్మడానికి వెళ్తున్నట్లు చెప్పడంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. సురేశ్‌ను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు.

గాలివాన బీభత్సంతో విరిగిన విద్యుత్ స్తంభాలు

పలు గ్రామాల్లో నేలవాలిన వరి

సిద్దెంకిలో గాలివానకు కూలిన విద్యుత్ స్తంభం

నెల్లుట్ల శ్రీనివాస్‌నగర్‌లో

జనగామ రూరల్, అక్టోబర్ 2 : గాలివాన బీభత్సంతో పలు గ్రామాల్లో వరి పంట నేలవాలగా, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో వాన కురిసింది. చేతికి వచ్చే దశలో వరిపంట గాలి దూమారానికి నేలవాలింది. సిద్దెంకి, పెంబర్తి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేల కులాయి. దీంతో కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది. దీంతో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు. అకాల వర్షంతో వరి, పత్తి, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయని పలువురు రైతులు తెలిపారు.

లింగాలఘనపురంలో..

లింగాలఘనపురం : మండలంలో బుదవారం సా యంత్రం ఉధ్రుతంగా వీచిన గాలివానకు కళ్లెం మీదుగా జనగామ మండలం పెంబర్తికి వెళ్లే విద్యుత్ స్తంభాలు విరిగాయి. దీంతో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. మరోవైపు నెల్లుట్ల శ్రీనివాస్‌నగర్‌కాలనీ సమీపంలో ఓ ట్రాక్టర్ షోరూం యాజమాన్యం టిప్పర్ల ద్వార మట్టిని పోయిస్తుండగా, టిప్పర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో నాలుగు స్తంభాలు విరిగాయని లైన్‌మెన్ నర్సయ్య తెలిపారు. దీంతో తమ సంస్థకు రూ.41 వేల నష్టం వాటిల్లిందని ఆయన వివరించారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : ఈదురుగాలులతో కూడిన వర్షం మండలంలో బుధవారం సాయంత్రం కురిసింది. పది రోజులుగా వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం సుమారు గంట పాటు కురిసిన వర్షానికి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

చిల్పూరులో..

చిల్పూరు : మండలం చిన్నపెండ్యాల, నష్కల్, రాజవరం, పల్లగుట్టలో భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ వేడిమితో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈదురుగాలులతో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. పత్తి, మక్కజొన్న చేన్లకు నష్టం వాటిల్లిందని పలువురు రైతులు తెలిపారు.

శివునిపల్లిలో కురుస్తున్న వర్షం.

ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 2 : ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజయశ్రీ సూచించారు. బుధవారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో 2024 – 2025 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకంలో నూతన పనుల గుర్తించుటకు గ్రామ సభ నిర్వహించారు. గత సంవత్సరం చేపట్టిన పనులను ప్రజలకు, రైతులకు, ఉపాధిహామీ కూలీలకు వివరించారు. ఈ సంవత్సరం చేపట్టాల్సిన పనులపై ప్రజలు, రైతులు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఏపీవో ప్రేమయ్య, పంచాయతీ కార్యదర్శి లింగయ్య, జూనియర్ అసిస్టెంట్లు మంజల, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

రఘునాథపల్లి అక్టోబర్ 2 : ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మహాదేవ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలోని దేవాలయ ప్రాంగణంలో బుధవారం పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య రోజురావడంతో మహా అన్నదానం చేశారు. పూజారి పిండిపోలు శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు పూజారి తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, చింతకింది కృష్ణమూర్తి, కూరెళ్ల వేదకుమార్ గుప్తా దంపతులతో పాటు కొన్నె రమ, ఆకుల జ్యోతి, ఇంజ పూరి రమ, బచ్చు చిరంజీవి గుప్తా, లింగయ్య గుప్తా పాల్గొన్నారు.